క్లుప్తంగా

ప్రజాపాలన దరఖాస్తుల్లో తప్పులు సవరించుకోవాలి



ఇబ్రహీంపట్నంలో సేవా కేంద్రం

ఇబ్రహీంపట్నం: ప్రజాపాలన దరఖాస్తుల్లో ఏమైనా తప్పులుంటే సవరించుకోవచ్చని ఎంపీవో కృపాకర్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రజాపాలన సేవా కేంద్రంను అధికారులు ప్రారంభించారు. ప్రజాపాలన దరఖాస్తుల్లో ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, సెల్‌నంబర్ మొదలైనవి తప్పులు రాసి ఉంటే వాటిని ఈ కేంద్రం వద్దకు వచ్చి సవరించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, కంప్యూటర్ ఆపరేటర్ నరేశ్, టైపిస్ట్ నాగారాణి తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత వేదిక యువిక

జగిత్యాల: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) 9వ తరగతి విద్యార్థుల కోసం ఒక ప్రత్యేక కార్యక్రమం ప్రారంభించినట్లు జిల్లా సైన్స్ అధికారి బాజోజి శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థుల ఆలోచనలు మెరుగుపర్చాలనే ఉద్దేశంతో ఇస్రో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని, ఈనెల 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. యువిక అధికారులు ఇస్రో వెబ్‌సైట్‌ను ప్రారంభించారని, అందులోకి వెళ్లి విద్యార్థులు వివరాలు నమోదు చేసుకోవాలని, ఎంపికై నవారికి అహ్మదాబాద్, డెహ్రాడూన్, శ్రీహరికోట హైదరాబాద్, బెంగళూరు, షిల్లాంగ్, తిరువనంతపురంలో శిబిరాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు.

సాతారంలో ముగ్గురికి సర్కారీ కొలువులు



గంగాధర్, స్వాతి భవాని, నవిత

మల్లాపూర్: మండలంలోని సాతారం గ్రామానికి చెందిన ముగ్గురు సర్కారు కొలువులు సాధించారు. పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ఫిజియోథెరపిస్ట్‌గా పత్తిపాక గంగాధర్, గురుకుల కళాశాలలో జూనియర్ లెక్చరర్‌గా స్వాతి భవాని, టీజీటీగా ఆర్మూర్ నవిత ఎంపికై గ్రామానికి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బొడ్డు సుమలత, ఎంపీటీసీ గున్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన గంగాధర్, స్వాతి భవాని,నవితలను అభినందించారు.

లక్ష్య సాధనకు బాధ్యతలు అడ్డుకాదు



రమ్య

వెల్గటూర్ : లక్ష్య సాధనకు కుటుంబ బాధ్యతలు అడ్డుకాదని నిరూపించి పలువురికి ఆదర్శంగా నిలిచింది మండల కేంద్రానికి చెందిన బోధినపు రమ్య. కఠిన పరిస్థితులను జయించి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి అందరి మన్ననలు పొందింది. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో, చదువుపై ఇష్టంతో, వివాహానంతరం ఎమ్మెస్సీ బీఈడీ పూర్తిచేసి ఓవైపు కుటుంబ బాధ్యతలు మోస్తూనే మరోవైపు కష్టపడి చదివి మొదటి ప్రయత్నంలోనే కేజీబీవీలో కాంట్రాక్టు టీచర్ ఉద్యోగానికి ఎంపికై విధులు నిర్వహిస్తూనే, గురుకుల పరీక్షల్లో టీజీటీ, జూనియర్ లెక్చరర్‌గా ఒకేసారి రెండు ఉద్యోగాలు సాధించింది. కష్టపడి చదివితే కుటుంబ బాధ్యతలు ఏవీ లక్ష్య సాధనకు అడ్డురావని, తనకు సహకరించిన భర్త శ్రీనివాస్, కుటుంబ సభ్యులకు రమ్య కృతజ్ఞతలు తెలిపారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

జగిత్యాలటౌన్: మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు బాదినేని రాజేందర్‌తో కలిసి మాట్లాడారు. దశాబ్దకాలంగా కార్పొరేషన్ కోసం డిమాండ్ చేస్తున్నామని, కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బండారి రాజ్‌కుమార్, నాయకులు దీటి అంజయ్య, ఒడ్నాల రాజశేఖర్, రాజేశ్, రాజేశం, లింగారెడ్డి, మల్లారెడ్డి, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాలకు మరమ్మతు చేయించండి

కొండగట్టు: కొండగట్టు అంజన్న ఆలయంలోని ఉత్తరభాగంలో ఉన్న విష్ణుమూర్తి, లక్ష్మీ అమ్మవార్లు, ఆలయ గోపురం, ఇతర ప్రాకారాలు, జేఎన్టీయూ సమీపంలోని కమాన్, నాచుపల్లి వద్ద గల దొంగల మర్రి కమాన్‌పై ఉన్న దేవత విగ్రహాలు విరిగిపోయాయని, వాటికి మరమ్మతు చేయించాలని తిప్పాయ్యపల్లికి చెందిన భక్తుడు భార్గవ్ సోమవారం ఆలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు.

ఉపాధిహామీ ప్రణాళిక సిద్ధం

- 2024-25లో 39 లక్షల మందికి పని కల్పించాలని లక్ష్యం
- పూర్తయిన గ్రామ సభలు
- సుమారు రూ.150 కోట్ల బడ్జెట్

జిల్లాలో మొత్తం మండలాలు	20
గ్రామ పంచాయతీలు	380
మొత్తం జాబ్‌కార్డులు	1,55,850
కూలీల సంఖ్య	2.82 లక్షలు



నర్సరీలో ప్లాస్టిక్ కవర్లలో మట్టి నింపుతున్న ఉపాధి కూలీలు (ఫైల్)

పెగడపల్లి: ఉపాధిహామీ పథకం కూలీల పాలిట వరమైంది. గ్రామాల్లో వలసల నివారణకు కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం కూలీలకు భరోసాగా నిలుస్తోంది. వేసవి కాలంలో కూలీలకు పనులు లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కూలీలకు వంద రోజుల పని కల్పించడమే లక్ష్యంగా ఉపాధి హామీ పథకంలో పనులు గుర్తించి ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లాలో ఉపాధిహామీ పథకానికి సంబంధించి 2024-25 ఆర్థిక సంవత్సరానికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. జిల్లాలో 380 పంచాయతీల్లో 39 లక్షల మందికి పని కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ పనులకు సుమారు రూ. 150 కోట్ల బడ్జెట్ అవసరం ఉంటుందని అంచనా వేశారు. ఇందులో కూలీలకు సుమారు రూ. 90 కోట్లు, మెటీరియల్‌కు కాంపొనెంట్‌కు సుమారు రూ. 50 కోట్లుగా పేర్కొన్నారు.

గత నెలలో ఈజీఎస్ అధికారులు గ్రామాల్లో సర్పంచుల సమక్షంలో గ్రామసభలు నిర్ణయించి పనులను ఎంపిక చేశారు. ప్రస్తుతం జిల్లాలో 1,55,850 జాబ్ కార్డులున్నాయి. దీనిలో 2,82,748 మంది కూలీలు నమోదు చేసుకున్నారు. ఈ పథకం ద్వారా వచ్చే ఆర్థికం సంవత్సరంలో నీటి కాలువల్లో పూడికతీత, కాంటూర్ కందకాల తవ్వకాలు, గ్రామీణ పారిశుద్ధ్యం, మట్టిరోడ్లు, కల్లాల నిర్మాణాలు, హరితహారం, శ్మశానవాటికలు, ఇంకుడుగుంతల తవ్వకాలు, ఫాంపాండ్స్, వర్మి కంపోస్టు, డంపింగ్ యార్డులు, కిచెన్‌షెడ్లు, పాఠశాలల్లో మూత్రశాలలు, హరితహారం మొక్కల పెంపకం, స్వచ్ఛ భారత్ మిషన్ తదితర పనులు చేపట్టనున్నారు.

గ్రామసభ ఆమోదంతోనే పనులు గుర్తింపు

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 380 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాం. గ్రామసభల్లో ఆమోదించిన పనులనే చేపడుతాం. వచ్చే ఏడాదికి 39 లక్షల పని దినాలను కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించాం. అడిగిన ప్రతి కూలీకి జాబ్‌కార్డు అందించి పని కల్పిస్తాం. కూలీలు సద్వినియోగం చేసుకోవాలి.

– వెంకటేశ్వర్‌రావు, డీఆర్డీవో

యాదవులకు మార్కెట్ చైర్మన్ పదవి ఇవ్వాలి



సమావేశమైన యాదవ సంఘం నాయకులు

మేడిపల్లి: మేడిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి యాదవులకు కేటాయించాలని మండల యాదవ సంఘం నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక పీఎస్‌ఆర్ గార్డెన్ లో సోమవారం మండల యాదవ సంఘం సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు యాదవులు అండగా నిలిచి గెలిపించారని, అందుకే యాదవులను రాజకీయంగా ప్రోత్సహించాలని, మార్కెట్ చైర్మన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జగిత్యాల జిల్లా యాదవ కమిటీ ప్రెసిడెంట్ పలుమారు మల్లేష్ యాదవ్, రాష్ట్ర నాయకులు బినావేని ముకేశ్, నియోజకవర్గ ఇన్‌చార్జి అదే లక్ష్మిరాజం,మేడిపల్లి మండల అధ్యక్షుడు అదే రమేశ్, భీమారం మండల అధ్యక్షుడు రెబ్బాస్ మల్లయ్య, బీనవేని రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాలువకు గండి



గండి పడిన ఎస్సారెస్పీ కాలువ

సారంగాపూర్: ఎస్సారెస్పీ డీ-53 అనుబంధ కాలువ 12 ఎల్ 1ఆర్ కాలువకు గండి పడడంతో కాలువ చివరి భూములకు సాగునీరందడం లేదని రైతులు వాపోతున్నారు. ఈ కాలువ ద్వారా సారంగాపూర్,బట్టపల్లి,పోతారం గ్రామాల పంటపొలాలకు నీరందుతుంది. ఇటీవల నూతనంగా నిర్మించిన అక్విడేట్ చివరన కాలువకు ఒక పక్క గండిపడడంతో మూడు గ్రామాల పంటపొలాలకు సాగునీరందడం కష్టంగా మారింది. వెంటనే అధికారులు స్పందించి మరమ్మతులు చేసి తమ పొలాలను కాపాడాలని రైతులు వేడుకుంటున్నారు.

రైతు సమస్యలపై పోరాటంతోనే గుర్తింపు



వ్యవస్థాపక దినోత్సవంలో బీకేఎస్ సభ్యులు

మల్లాపూర్: రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతర పోరాటంతో భారతీయ కిసాన్‌సంఘ్‌కి గుర్తింపు దక్కిందని ఆ సంఘం మండల అధ్యక్షుడు క్లాం మహిపాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని భరతమాత కూడలి వద్ద నిర్వహించిన భారతీయ కిసాన్‌సంఘ్ వ్యవస్థాపక దినోత్సవంలో జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరుగాలం కష్టించి రైతులు పండించే పంటలు అటవీ జంతువుల దాడులతో తీవ్రంగా దెబ్బతింటున్నాయని, వాటి నుంచి పంటల రక్షణకు రైతులకు సబ్సిడీపై చైన్ లింక్ ఫెన్సింగ్, ఇతర ఉపయోగకరమైన వస్తువులను అందించాలన్నారు. . కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భూమారెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి

మల్లాపూర్: రబీలో పంటల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి సొంతమవుతుందని ఏఈవో సాయిప్రియ అన్నారు. మండలంలోని సాతారం, రేగుంట గ్రామాల్లో రైతులతో కలిసి నువ్వు, వరి పంటలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం, రాయితీ విత్తనాలు, యాంత్రీకరణ, పంట రుణాల గురించి రైతులకు వివరించారు. సేంద్రియ వ్యవసాయంలో అతి తక్కువ ఖర్చుతో వ్యవసాయం చేసి ఆరోగ్యకరమైన పంటలు పండి రైతులు బలోపేతం అవుతారన్నారు. కార్యక్రమంలో రైతులు నిమ్మల జలందర్‌రెడ్డి, చిన్నారెడ్డి, గంగారెడ్డి, భూమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివ దీక్షాపరుల శోభాయాత్ర

కథలాపూర్: మండల కేంద్రంలో శివదీక్షాపరులు సోమవారం శోభాయాత్ర నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై శివుడి విగ్రహంతో ప్రధానవీధుల గుండా ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వామివారికి స్వాగతం పలికి పూజలు చేశారు. శివదీక్షాపరులు ఆటాపాటలతో సందడి చేశారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

పెగడపల్లి: మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం గ్రామానికి చెందిన జాల అశోక్‌రెడ్డి-భాగ్య, జాల సురేశ్‌రెడ్డి-పావని రూ. 50 వేలు విరాళం సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు వారిని అభినందించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ భూమాడి గంగారెడ్డి, ప్రధాన కార్యదర్శి పోచయ్య, పార్థసారథి, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రాయికల్: విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని తహసీల్దార్ ఖయ్యూం అన్నారు. రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ భద్రతాదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతంత్య్ర సమరయోధుడు జైన్ ఉల్లాద్దీన్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మచ్చ గంగాధర్, డైరెక్టర్లు లలిత, విద్యాన్వేష్ పాల్గొన్నారు

‘గృహజ్యోతి’ సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్: గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీనివాస్‌రావు అన్నారు. మండలంలోని ఒబులాపూర్‌లో సోమవారం గృహజ్యోతి పథకాన్ని ప్రారంభించి లబ్ధిదారుల ఇంట్లో మీటర్ రీడింగ్ తీసి వారికి జీరో బిల్లు అందజేశారు.కార్యక్రమంలోనాయకులు రుత్త నారాయణ, కోమ్ముల చిన్నారెడ్డి, గజ్జి రమేష్, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

కొడిమ్యాలలో ‘గృహజ్యోతి’ ప్రారంభం

కొండగట్టు: కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు పథకాలలో భాగంగా గృహజ్యోతి పథకాన్ని కొడిమ్యాల మండల కేంద్రంలో సోమవారం విద్యుత్ అధికారులతో కలిసి కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జమల్పూరి రాజేశ్వరి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గడ్డం సునీతారెడ్డి, నాయకులు చిలువేరి ప్రసాద్, జితేందర్, రాజేందర్, వినోద్‌రెడ్డి, కల్యాణ్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతి సంబరాలు

రాయికల్: గృహజ్యోతి పథకం ప్రారంభించడంతో సోమవారం పట్టణంలోని పాత బస్టాండ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి కొయ్యడి మహిపాల్ రెడ్డి, నాయకులు పడిగెల రవీందర్‌రెడ్డి, ఎద్దండి దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రం ప్రారంభం

మల్యాల: మల్యాల మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. గృహలక్ష్మీ పథకం కింద అర్హులైన వారు ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో స్వాతి తెలిపారు. గతంలో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారు, అర్హులై ఉండి కూడా సంబంధిత పత్రాలు జతచేయని వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కుట్టు మిషన్లు పంపిణీ

మల్యాల: మండలంలోని తాటిపల్లిలో ఫాతిమాన గర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ శిక్షణ పొందిన 28 మంది మహిళలకు సోమవారం కుట్టు మిషన్లు పంపిణీ చేసి, సర్టిఫికెట్లు అందజేశారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వాతి, ఎస్సై అబ్దుల్ రహీం, డైజో, ప్రీతి, దీప్తి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామ శివారులో సోమవారం ఉదయం అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. రాయికల్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేసి ట్రాక్టర్ డ్రైవర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జగిత్యాల రూరల్ మండలం చర్లపల్లి గ్రామ శివారులో సోమవారం ఉదయం అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు. ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసి ట్రాక్టర్ డ్రైవర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రొసీడింగ్‌లు అందజేత

మేడిపల్లి: భీమారం మండలంలోని పలు గ్రామాల కులసంఘాలకు రూ.1.55 కోట్ల నిధులు మంజూరైనట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరేశ్ రెడ్డి తెలిపారు. వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో నిధులు మంజూరయ్యాయని, ఈ సందర్భంగా విప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఆయా కుల సంఘాల పెద్ద మనుషులకు ప్రొసీడింగ్ కాపీలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లచ్చా నాయక్, దుంపేట నర్సయ్య, పూల్లారి దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది ప్రజా ప్రభుత్వం

వెల్గటూర్ : కాంగ్రెస్‌ది ప్రజా ప్రభుత్వమని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ అన్నారు. సోమవారం ఎండపల్లిలో పర్యటించిన ఆయన కార్యకర్తలు, గ్రామస్తులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే నాలుగు గ్యారెంటీలు అమలు చేసిందని, త్వరలోనే ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం వంశీ, ఎండపల్లి ఎంపీటీసీ బషీర్, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యతోనే మహిళా సాధికారత

జగిత్యాల: విద్యతోనే మహిళ సాధికారత సాధిస్తుందని జిల్లా మహిళా సాధికారత జిల్లా కో-ఆర్డినేటర్ అశ్విని అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మహిళా డిగ్రీ కళాశాలలో మహిళలకు అవగాహన కల్పించారు. మహిళలు మానసికంగా వెనుకబడి ఉన్నారని, ప్రతి బాలికను చదివించాలన్నారు. సఖీ లీగల్ కౌన్సిలర్ లావణ్య మాట్లాడుతూ, మహిళలు సఖీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మసూర్ సుల్తానా, శ్రీనివాస్‌రెడ్డి, చైల్డ్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

లొంక రామన్న జాతర పోస్టర్ ఆవిష్కరణ



కథలాపూర్:మండలంలోని పోతారంలో ఈనెల 9న నిర్వహించే లొంక రామన్న జాతర ఉత్సవాల వాల్‌పోస్టర్‌ను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు సోమవారం ఆవిష్కరించారు. 8న మహాశివరాత్రి జాగరణ, 9న జాతర, మహాఅన్నదానం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పులి శిరీషా, మాజీ సర్పంచ్ జలందర్, పాలెపు గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవ పోస్టర్..

ధర్మపురి: మండలంలోని నేరెళ్ల సాంబశివ ఆలయంలో ఈనెల 8 నుంచి 10 వరకు జరుగనున్న మహా శివరాత్రి పోస్టర్‌ను సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాంబశివ ఆలయం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



గుల్లపేటలో సీసీరోడ్డు పరిశీలిస్తున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: గ్రామాల్లో ఎన్‌ఆర్ ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సీసీరోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. సోమవారం జగిత్యాల రూరల్ మండలం గుల్లపేటలో రూ.30లక్షలతో నిర్మించిన బైపాస్‌రోడ్ సీసీరోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 9 ఏళ్లుగా గ్రామాలు అభివృద్ధికి నోచుకోకపోవడంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ప్రతి గ్రామంలో సీసీరోడ్డు, మురికికాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు కూడా పూర్తిదశకు వచ్చాయన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శేఖర్, నాయకులు దమ్మ గంగారెడ్డి, తిరుపతిరెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

నాగలింగేశ్వరస్వామి ఆలయానికి భూమిపూజ

మండలంలోని తిమ్మాపూర్ రఘురాములకోటలో నూతనంగా నిర్మించే నాగ లింగేశ్వరాలయానికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సోమవారం భూమిపూజ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు వెచ్చిస్తోందన్నారు. మాజీ సర్పంచులు మేరుగు రమ్య, మునీందర్‌రెడ్డి, భూదాతలు పల్లికొండ లక్ష్మణ్, అనసూయ, కొండ లక్ష్మణ్, అరుణ పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

ధర్మపురి: పట్టణంలోని శ్రీలక్ష్మీనరసింహ ఫంక్షన్ హాల్‌లో సోమవారం జరిగిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు కుమార్తె రిసెప్షన్‌కు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తదితరులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

పంచాయతీ కార్యదర్శి లేక పరేషాన్

ఇబ్రహీంపట్నం: మేజర్ గ్రామపంచాయతీ ఇబ్రహీంపట్నంలో 20 రోజులుగా పంచాయతీ కార్యదర్శి లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి సాయినాథ్‌ను కథలాపూర్ నుంచి డిప్యూటేషన్‌పై ఇబ్రహీంపట్నంకు రాగా, బదిలీల్లో భాగంగా డిప్యూటేషన్ రద్దు చేసి కథలాపూర్‌కు బదిలీ చేశారు. ఇబ్రహీంపట్నంకు చిన్న మెట్‌పల్లి నుంచి జూనియర్ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణను బదిలీ చేయగా అతను బాధ్యతలు చేపట్టలేదు. దీంతో గ్రామంలో పంచాయతీ కార్యదర్శి లేక మరణ ధృవీకరణ పత్రాలు, తీర్మానం కాపీలు ఇచ్చే పరిస్థితి లేదు. నిత్యం ఉపాధి పనులు పర్యవేక్షించే కార్యదర్శి లేక పనులు సరిగ్గా జరగడం లేదు. రైతులు ఈజీఎస్ ద్వారా సీసీ కల్లాలను నిర్మించుకోగా, ఆ బిల్లులు ఇటీవల పంచాయతీ కార్యదర్శి ఖాతాకు జమైనట్లు రైతులు తెలిపారు. కార్యదర్శి లేక రైతులకు బిల్లులు రావడం లేదని పారిశుద్ధ్య పనులు కూడా సరిగ్గా జరగడం లేదని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. మేజర్ గ్రామపంచాయతీ అయినా ఇబ్రహీంపట్నంకు సీనియర్ కార్యదర్శిని నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రజావాణికి ఇద్దరే అధికారులు

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఏపీఎం శంకర్, మండల పరిషత్ కార్యాలయం నుంచి టైపిస్ట్ నాగారాణి మాత్రమే హాజరయ్యారు. ప్రజావాణికి అన్ని శాఖల అధికారులందరూ తప్పనిసరిగా హాజరుకావాలని తహసీల్దార్ కోరారు.

సంక్షిప్త వార్తలు

ఫిర్యాదుదారులకు సత్వర సేవలందించాలి

జగిత్యాలక్రైం: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు సత్వర సేవలందించాలని డీఎస్పీ రఘుచందర్ అన్నారు. సోమవారం జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిధిలో డయల్ 100 సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో నిత్యం వాహనాలతో పాటు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐ వేణుగోపాల్, రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడలు తప్పనిసరి

రాయికల్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు తప్పనిసరని మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు అన్నారు. రాయికల్ పట్టణంలోని ప్రగతి పాఠశాలలో సోమవారం స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసికోల్లాసం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, తహసీల్దార్ ఖయ్యూం, కరస్పాండెంట్ బాలే జయశ్రీ శేఖర్, డైరెక్టర్ నిఖిల్, కౌన్సిలర్ కన్నక మహేందర్ పాల్గొన్నారు.

చెత్త తొలగించాలని అధికారులకు వినతి

రాయికల్: పట్టణంలోని 9 వార్డులో నెల రోజుల నుంచి చెత్త తొలగించడం లేదని, మురికికాలువల్లో చెత్తను తొలగించకపోవడంతో దోమల బెడద తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కౌన్సిలర్ ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే చెత్తను తొలగించాలని సోమవారం మున్సిపల్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలి

జగిత్యాలటౌన్: తెలంగాణ పోరాటంలో కీలకపాత్ర పోషించిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆత్మీయ సమ్మేళనానికి గౌడ సోదరులు భారీ సంఖ్యలో హాజరు కావాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొల్లపల్లి చంద్రశేఖర్‌గౌడ్ పిలుపునిచ్చారు. గౌడ సోదరులతో కలిసి సోమవారం ఆత్మీయ సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల: పట్టణంలోని ఒకినావా స్కూల్ ఆఫ్ కరాటే విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ 2024 పోటీల్లో ప్రతిభ చాటి బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారు. వేములవాడలో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో కోరుట్ల విద్యార్థులు 18 పతకాలు సాధించినట్లు కోచ్ అల్లే రమేశ్ తెలిపారు. ఈ సందర్భంగా రమేశ్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సత్కరించారు. పతకాలు సాధించిన విద్యార్థులను పలువురు అభినందించారు.

రాయికల్: మంచిర్యాల జిల్లా మందమర్రిలో ఆల్ స్టైల్ మార్షల్ ఆర్ట్స్ 7వ నేషనల్ లెవల్ కరాటే కుంగ్ ఫూ ఓపెన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రాయికల్ పట్టణానికి చెందిన సుషాంత్, శశాంక్, హంసిత్, యశ్వంత్,సాత్విక్, ప్రహర్షిత, సాన్వి, సాహితి, సాత్వి, శ్రీకృతి, నేహాలు బంగారు వెండి పతకాలు సాధించినట్లు మాస్టర్ ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు.

సామగ్రి ధ్వంసం చేసిన వ్యక్తిపై కేసు

సారంగాపూర్: అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి సామగ్రిని ధ్వంసం చేసిన ఓ వ్యక్తిపై కేసు నమోదైంది. మండలంలోని వడ్డెర కాలనీకి చెందిన బోదాసు నాంపల్లి ఇంట్లోకి ఇదే గ్రామానికి చెందిన పోగుల నాంపల్లి అక్రమంగా ప్రవేశించి సామగ్రి ధ్వంసం చేయడంతో పాటూ ఇంట్లోని వ్యక్తులను అసభ్యకరంగా దూషించాడు.దీంతో బోదాసు నాంపల్లి భార్య లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

విద్యానగర్‌లో చోరీ

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో తాళాలు వేసిన ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. విద్యానగర్‌కు చెందిన ఓ వ్యక్తి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో వేరే ప్రాంతానికి వెళ్లారు. గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న వస్తువులను చిందర వందర చేశారు. వరుసగా విద్యానగర్‌లో చోరీ జరుగుతుండటంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు.

అక్కపెల్లి రాజన్న ఆలయ కమిటీ నియామకం

ధర్మపురి: పట్టణంలోని శ్రీఅక్కపెల్లి రాజరాజేశ్వర స్వామి దేవస్థానం నూతన కమిటీ నియమిస్తూ దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఈవో శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా సీపతి సత్తనారాయణ, సభ్యులుగా సురుకంటి గంగారెడ్డి, ఒడ్డేటి రాజయ్య, గొట్టం లక్ష్మిలను నియమించినట్లు పేర్కొన్నారు.

టోల్‌ఫ్రీ నంబర్లపై అవగాహన

రాయికల్: మండలంలోని ఇటిక్యాలలో అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం మహిళలకు టోల్‌ఫ్రీ నంబర్లపై అంగన్‌వాడీ టీచర్ ఏలేటి సుజాత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు సుమలత, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

మల్లాపూర్: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 6న మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ కాటిపెల్లి సరోజన అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌కుమార్ పాల్గొననున్నారని, అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

కేపీఎల్ విజేత సన్‌రైజర్స్

కోరుట్ల: పట్టణంలో కోరుట్ల ప్రీమియర్ లీగ్ సీజన్ 4 క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ముగిశాయి. సోమవారం జరిగిన ఫైనల్‌లో కోరుట్ల కు చెందిన సన్‌రైజర్స్ జట్టు రాయికల్ కు చెందిన కింగ్స్ జట్టు తలపడగా కోరుట్ల సన్ రైజర్స్ జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ. 70 వేల నగదు పారితోషికం, రాయికల్ కింగ్స్ జట్టుకు రూ.35 వేల పారితోషికంతో పాటు ట్రోఫీని పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అన్నం అనిల్ అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు శివకుమార్, ఎంఏ భారీ, సలీం ఫారుఖీ, తదితరులు పాల్గొన్నారు.